సురేఖ ఇలాకా.. రైతుకు ధోకా

వంచనగిరిలోని పీఏసీఎస్ కార్యాలయం

వంచనగిరిలో రైతుల వంచన

- మంత్రి కొండా సురేఖ గ్రామంలో 30 శాతం మందికే రుణమాఫీ
- పీఏసీఎస్‌లో 681 మంది రుణం పొందితే 200 మంది రైతులకే మాఫీ వర్తింపు
- ఆందోళనలో మిగతా 481 మంది
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

వరంగల్, ఆగస్టు 25 (నమస్తేతెలంగాణ): దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వగ్రామం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరిలో అన్నదాతలకు జరిగిన రుణమాఫీ తీరు.. కాంగ్రెస్ సర్కారు డొల్లతనానికి అద్దంపడుతున్నది. 681 మంది వంచనగిరి పీఏసీఎస్ ద్వారా రుణాలు పొందారు. రుణమాఫీకి వీరంతా అర్హులేనని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేయగా వంచనగిరి పీఏసీఎస్ నుంచి రుణం పొందిన వారిలో 200 మందికి మాత్రమే మాఫీ వర్తించింది. మిగతా 481 మంది మాఫీ కోసం పీఏసీఎస్ చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే మాఫీ అవుతుందని చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

వంచనగిరి పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యం, అక్రమాలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల గ్రామంలో 481 మంది రైతులకు మూడు విడతల్లోనూ రుణమాఫీ జరగలేదని తెలిసింది. వంచనగిరి నుంచి 50 మంది రైతులు 2023 డిసెంబర్ 9లోపు రుణాలను పొందగా.. వంచనగిరి పీఏసీఎస్ అధికారులు 2023 డిసెంబర్ 9 తర్వాత నమోదు చేశారు. దీంతో ఈ యాభై మంది రైతులు రుణమాఫీకి దూరం కావాల్సి వచ్చింది. రుణమాఫీ వర్తించని రైతుల్లో పలువురు 2023 డిసెంబర్ 9లోగా గతంలో తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించి కొత్తగా మళ్లీ రుణం పొందితే.. వంచనగిరి పీఏసీఎస్ అధికారులు పాత రుణాలను చెల్లించి కొత్తగా రుణాలను పొందిన రైతుల పేర్లను పేర్కొనలేదు. రైతులు చెల్లించిన పాత రుణాల డబ్బు ఏమైంది? ఆ రుణాలను వడ్డీ సహా చెల్లించిన రైతులకు పీఏసీఎస్ అధికారులు ఇచ్చిన రసీదులు నకిలీవా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. రుణమాఫీని కోల్పోయిన రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

1.5 లక్షలకు రూ.58,254 మాఫీ

నేను వంచనగిరి పీఏసీఎస్‌లో రెండు విడతల్లో రూ.25 వేల రుణం తీసుకున్న. ప్రభుత్వం రుణమాఫీ చేసిన సమయంలో కొంత రుణం మాఫీ అయింది. వడ్డీ సహా మొత్తం రుణం చెల్లించాలని అధికారులు అడగ్గా 2023 సెప్టెంబర్ 4న రూ.55,700 పీఏసీఎస్‌లో చెల్లించి రశీదు తీసుకున్న. అదే నెల 29న ఇదే పీఏసీఎస్ నుంచి కొత్తగా రూ.1.5 లక్షల రుణం పొందాను. తాజాగా ప్రభుత్వం మూడు విడతలుగా చేసిన రుణమాఫీలో అర్హత ఉన్నా 1.5 లక్షల రుణం మాఫీ కాలేదు. గత సెప్టెంబర్ 4న చెల్లించిన రూ.55,700 పాత రుణానికి సంబంధించిన రుణం వడ్డీ సహా రూ.58,254 మాఫీ అయింది. 2023 సెప్టెంబర్ 4 నుంచి ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేసే వరకు రూ.55,700కు వడ్డీ రూ.2,554 కావటం వల్ల నాకు మాఫీ రూ.58,254 వర్తించింది. ఇదేమిటని నేను వంచనగిరి పీఏసీఎస్ కార్యాలయానికి వెళ్లి అడిగాను. సెప్టెంబర్ 4న చెల్లించిన రూ.55,700 నా ఖాతాలో జమ కాలేదని, పీఏసీఎస్ అధికారుల జేబులోకి వెళ్లిందని తేలింది. పాత రుణానికి సంబంధించిందే రూ.58,254 రుణం ఉన్నట్టు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత సెప్టెంబర్ 29న పీఏసీఎస్ నుంచి పొందిన రూ.1.5 లక్షల రుణం మాఫీ కోసం ప్రభుత్వానికి పంపిన జాబితాలో అధికారులు ప్రస్తావించలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రూ.1.5 లక్షల మాఫీ వర్తించకుండా పోయింది. బాధ్యులై చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.

- గంగుల పెంటయ్య, రైతు

'భరోసా' లేని ఎవుసం

- అరకొర రుణమాఫీ.. అందని రైతు భరోసా
- మళ్లీ అప్పులపాలైతున్న రాష్ట్ర రైతులు
- రైతుభరోసా ఎప్పుడిస్తారో చెప్పని సర్కారు
- రుణమాఫీనే రైతు భరోసా అనుకోవాల్నా?
- సర్కారు మాటలు.. పనులకు పొంతన లేదు
- అమలు చేస్తున్న పథకాల్లోనూ కోతలే
- సరైన టైంలో వర్షాల్లేక సాగుపైనా ప్రభావం
- 8 లక్షల ఎకరాలు తగ్గిన సాగు

హైదరాబాద్, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): రైతులందరికి కావాల్సిన రుణమాఫీ కొందరికే అయింది. ఇప్పటికే ఖాతాలో పడాల్సిన రైతు భరోసా పడలేదు.. సరైన వర్షాలు కురువక కాలం సైతం కక్షగట్టింది.. వెరసి రాష్ట్రంలో రైతులు ఆగమైతున్నరు. సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మాత్రం.. రాజకీయాలే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలి నుంచి కూడా రైతులకు చెప్తున్న మాటలకు, చేస్తున్న పనులకు ఏ మాత్రం పొంతనం ఉండటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఏ పథకాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయటం లేదు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాల్లోనూ కోతలు పెడుతున్నది. దాంతో రైతులను ఆగం చేస్తున్నది.

రైతు భరోసా ఇంకెప్పుడు?

పంటల సాగుకు పెట్టుబడి సాయంగా అందించాల్సిన రైతు భరోసా(రైతుబంధు) పంపిణీపై ప్రభుత్వం ఊసెత్తడం లేదు. వానకాలం సాగు దాదాపు పూర్తయింది. అయినా ప్రభుత్వం నుంచి రైతులకు నయాపైసా పెట్టుబడి సాయం అందలేదు. గత ఏడాది బీఆర్‌ఎస్ సర్కారు జూన్ 26న రైతు బంధు పంపిణీని ప్రారంభించి ఆగస్టు 23 వరకు రైతులందరి ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమచేసింది. దాంతో రైతులకు పెట్టుబడి సాయానికి ఇబ్బంది రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం రైతు భరోసా ఎప్పుడు ఇస్తారనే అంశంపై స్పష్టత కరువైంది. అసలు ఇస్తారా? లేక ఈ సీజన్‌కు మంగళం పాడుతారా? అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రుణమాఫీ చేస్తున్నాం కదా.. ఇంకా రైతుభరోసా ఇవ్వటం ఎందుకని ప్రభుత్వం భావిస్తున్నదా? రైతుభరోసా పైసలను రుణమాఫీ కింద ఇచ్చేసి చేతులు దులుపుకొనే ఆలోచనలో ఉన్నదా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవటంతో రైతులు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

మంత్రుల కమిటీ ఏమైంది?

అనర్హులకు పెట్టుబడి సాయం అందుతున్నదనే సాకుతో రైతుబంధు పథకంలో కోతలు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. వివిధ నిబంధనల పేరుతో రైతుల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. రైతుల సంఖ్యలో కోతలు పెట్టేందుకు నలుగురు మంత్రులతో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 15 రోజుల్లో నివేదిక ఇస్తుందని, ఈ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో చర్చించి కొత్త విధివిధానాలు రూపొందించి రైతుభరోసా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కానీ కమిటీ ఏర్పాటై 2 నెలలు కావొస్తున్నా.. ఇప్పటికీ కమిటీ నివేదిక లేదు. అసెంబ్లీలో చర్చించిందీ లేదు.

రుణమాఫీ కాకపాయే!

ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్తున్న రుణమాఫీ కూడా రైతులకు పూర్తిగా దక్కడం లేదు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులుంటే ఇప్పటి వరకు 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసింది. అంటే 50 లక్షల మంది రుణమాఫీకి దూరమయ్యారు. అదేవిధంగా రూ.31 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా చేసింది మాత్రం 18 వేల కోట్లే. అర్హులైన రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వాళ్లంతా ఎవుసం పనులన్నీ వదిలేసి బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కక్షగట్టిన కాలం.. తగ్గిన సాగు

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకాలకు దూరమవుతున్న రైతులపై కాలం కూడా కక్ష గట్టిందనే అభిప్రాయాలున్నాయి. గతంతో పోల్చితే ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. ఈ వారం, పది రోజులుగా కురుస్తున్న వర్షాలే తప్ప సాగుకు అవసరమైన సమయంలో వర్షాలు కురవలేదు. దీనికి తోడు కాళేశ్వరంపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నీళ్లను ఎత్తిపోయడంలో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలున్నాయి. ఆ ప్రభావం సాగుపై స్పష్టంగా కనిపిస్తున్నది. గత ఏడాదితో పోల్చితే ఈ సీజన్‌లో సాగు ఏకంగా 8 లక్షల ఎకరాల్లో తగ్గింది. గత ఈ సమయానికి 1.09 కోట్ల ఎకరాలు సాగు కాగా, ప్రస్తుం 1.01 కోట్ల ఎకరాలే సాగు అవుతున్నది. గత ఏడాది మొత్తంగా రికార్డు స్థాయిలో 1.35 కోట్ల ఎకరాల్లో సాగైంది.

పథకాల్లో కోతలు

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాల్లో కోతలు పెడుతున్నదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, రైతు బంధు ఇస్తామని ప్రకటించి.. ఇప్పుడు మాత్రం అడ్డదిడ్డంగా కోతలు పెడుతున్నదని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతు ప్రభుత్వం కాదని, కోతల ప్రభుత్వం అంటూ విమర్శిస్తున్నారు.

రైతుబంధు సొమ్ముతో రుణమాఫీ?

సీజన్ ముగుస్తున్నప్పటికీ ఇంకా రైతుబంధు (రైతు భరోసా) ఇవ్వకపోవటంతో రైతుల్లో కొత్త అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వం అరకొరగా, అడ్డదిడ్డంగా కోతలతో రుణమాఫీ చేస్తున్న విషయం తెలిసిందే. అందుకే రైతుభరోసా ఆపిందనే వాదనలు వినిపిస్తున్నాయి. రైతుబంధు సొమ్ముతో రుణమాఫీ చేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతుభరోసా కింద కాంగ్రెస్ సర్కారు ఎకరానికి రూ.7,500 చొప్పున ఇవ్వాలంటే దాదాపు రూ.12 వేల కోట్లు కావాలి. కానీ ప్రభుత్వం ఈ నిధులను ఆపేసింది. ఆ నిధులతోనే రుణమాఫీ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- గత వానకాలంలో బీఆర్‌ఎస్ సర్కారు రైతుబంధు ప్రారంభించింది జూన్ 26
- రైతుబంధు పంపిణీ పూర్తి చేసింది ఆగస్టు 23
- రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ కదలిక శూన్యం
- రైతుబంధు నిబంధనల్లో మార్పుల కోసం జూలై 2 నలుగురు మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు
- క్యాబినెట్ సబ్‌కమిటీ 15 రోజుల్లో నివేదిక ఇవ్వాల్సి ఉండగా నేటికీ ఇవ్వలేదు.
- అసెంబ్లీలో చర్చించి నిబంధనలు రూపొందిస్తామన్న సర్కారు.. ఆ ముచ్చటే మర్చిపోయింది.
- రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేయాల్సింది 70 లక్షల మంది రైతులకు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసింది 22 లక్షల మందికే.
- రూ.31 వేల కోట్ల రుణమాఫీకి.. చేసింది రూ.18 వేల కోట్లే.
- 50 లక్షల మందికి ఇటు రుణమాఫీ కాలేదు.. అటు రైతుభరోసా రాలేదు.
- వర్షాలు లేక 8 లక్షల ఎకరాల సాగు తగ్గింది.

లోకం పోకడ

రెండు లక్షల వరకు రుణమాఫీ అంటే.. రెండు లక్షల డబ్బులా? రెండు లక్షల మంది రైతులా?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	32.6°c	23.3°c
మెదక్	31.5°c	21.4°c
నిజామాబాద్	30.4°c	22.9°c
హైదరాబాద్	29.4°c	22.6°c
రంగారెడ్డి	29.2°c	22.9°c
కరీంనగర్	29.0°c	24.0°c
వరంగల్	29.0°c	24.0°c
నల్లగొండ	29.0°c	23.2°c
మహబూబ్‌నగర్	28.1°c	21.3°c
ఖమ్మం	28.0°c	26.0°c

రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం

మరో ఐదు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : అల్పపీడనం ప్రభావంతో రానున్న ఐదురోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశమున్నట్టు తెలిపింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో 7.2సెం.మీ వర్షపాతం నమోదైంది.

రిజిస్ట్రేషన్ శాఖలో త్రిముఖ వ్యూహం

- రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకత పాటించాలి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు25 (నమస్తే తెలంగాణ): రిజిస్ట్రేషన్ శాఖలో త్రిముఖ వ్యూహాన్ని రూపొందించాలని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆదివారం ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రెండేండ్లలో ప్రభుత్వ భవనాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సేవలు అందిస్తాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని రిజిస్ట్రేషన్ శాఖల్లో ఉన్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. నూతన టెక్నాలజీని వినియోగించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఉద్యోగులకు సూచించారు. నిజాయితీ, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అద్దెలు, తదితర వసతులకు అవసరమైన బడ్జెట్‌ను త్వరలోనే మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ కార్యదర్శి, స్టాంపులు రిజిస్ట్రేషన్ల కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి మాట్లాడుతూ 2014లో రూ.2,746 కోట్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం నిరుడికి 14,588 కోట్లకు చేరుకున్నదని వివరించారు. అనంతరం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వార్షిక నివేదికను మంత్రి విడుదల చేశారు. సమావేశంలో అదనపు ఐజీలు, డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్‌పై వివాదం

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 19న కురిసిన భారీ వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా నీరు నిలిచింది. ఆ సమయంలో ఆర్టీసీ డ్రైవర్ సాంబయ్య నీళ్లలోనే బస్సు తీసుకెళ్లడంతో సగం వరకు నీటిలో మునిగింది. ఈత వచ్చినవాళ్లు బస్సులోంచి దూకి బయటకు రాగా, మహిళలు, పిల్లలు బస్సులో చిక్కుకుపోయారు. స్థానికులు స్పందించి మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకుచేర్చారు. దీనిపై విచారణ జరిపిన ఆర్టీసీ ఉన్నతాధికారులు డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు. మున్సిపల్, రైల్వే అధికారుల తప్పిదాలకు డ్రైవర్‌ను అన్యాయంగా బలిచేశారని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

బీసీ ఉద్యమనేత ఆమరణ దీక్ష

బీసీ డిక్లరేషన్ అమలుచేయాలని సంజయ్ డిమాండ్

- బీసీల జీవితాలతో సర్కారు చెలగాటం
- కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు!
- కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి
- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె

హిమాయత్‌నగర్/దుండిగల్, ఆగస్టు 25: కామారెడ్డి సభలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను సర్కారు తక్షణమే అమలు చేసి, బీసీ కులగణన చేపట్టాలన్న ప్రధాన డిమాండ్లతో బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ నేతృత్వంలో బీసీ నేతలు ఆమరణ నిరాహారదీక్షలకు దిగారు. బీసీ రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్ జయంతి సందర్భంగా హైదరాబాద్ హైదర్‌గూడలో ఫెడరేషన్ కేంద్ర కార్యాలయంలో సంజయ్‌కుమార్ తోపాటు హిందూ బీసీ మహసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, ప్రతినిధి చాపర్తి కుమార్‌కు పూల మాలలు వేసి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆమరణ నిరాహార దీక్షలను ప్రారంభించారు. బీసీల హక్కుల కోసం జక్కని సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరహార దీక్ష శిబిరం వద్దకు సీఐ చంద్రశేఖర్, డీఎస్సై వెంకటేశ్ దీక్షా శిబిరానికి వచ్చి శాంతియుతంగా ఆమరణ నిరహార దీక్ష చేస్తున్న వారిని బలవంతంగా అరెస్ట్ చేశారు. అనంతరం సంజయ్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లోనే దీక్ష కొనసాగిస్తున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో సంజయ్‌కుమార్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ పరామర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ సర్కారుకు రాజకీయ సమాధి తప్పదని వారు హెచ్చరించారు. రాష్ట్రంలోని బీసీల విశ్వసనీయత కోల్పోకముందే బీసీ కులగణన ప్రక్రియను ప్రభుత్వం మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీలు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక విప్లవం కోసం బీసీల పోరాటాన్ని మొదలు పెట్టామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

దీక్ష చేస్తున్న సంజయ్ కుమార్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అరెస్టులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరు: రాజారాం యాదవ్

హిమాయత్‌నగర్, ఆగస్టు 25: అరెస్టులు, అణచివేతలతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ హెచ్చరించారు. హైదర్‌గూడలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, హిందూ బీసీ మహసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, నేత చాపర్తి కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. అరెస్ట్ చేసిన బీసీ నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఈ ముగ్గురితోనే ఆగిపోదని, భవిష్యత్తులో అనేక మంది బీసీ నేతలు ఆమరణ దీక్షలకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. బీసీ సంఘాల నేతలకు ఎలాంటి హాని జరిగినా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు.

బీసీ సంఘాల సంఘీభావం

బీసీల హక్కుల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్‌కు పలువురు బీసీ, ఇతర సంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరంలో వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి, ప్రతినిధులు దాసోజు లలిత, పోశం అశోక్, పటేల్ వనజ, కొంగర నరహరి, సుజ్జి, వెంకటేశ్, అజయ్ పాల్గొని సంజయ్‌కుమార్ దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. పోలీస్‌స్టేషన్‌లో బీసీ సంఘాల నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, దాసు సురేశ్, నల్ల సూర్యప్రకాశ్ తదితరులు సంజయ్‌కుమార్‌ను పరామర్శించి సంఘీభావం తెలిపారు.

బీసీ కమిషన్ ఎప్పుడు?

> మొదటిపేజీ తరువాయి...

మరింత జాప్యం కావచ్చని, తద్వారా ఇప్పటికే గాడితప్పిన పంచాయతీల్లో పాలన మరింత దిగజారుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కానీ, ప్రభుత్వం మాత్రం కొత్త కమిషన్‌ను నియమించేందుకే మొగ్గుచూపుతున్నదని, ఆ కమిషన్ చైర్మన్‌గా విశ్రాంత జడ్జిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నదని వినికిడి.

మధ్యలోనే ఆగిపోయిన స్థిరీకరణ

సుప్రీంకోర్టు జారీ చేసిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలను అనుసరించి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు 2021లో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు నేతృత్వంలో ఉపేందర్, శుభప్రద్‌పటేల్, కిశోర్‌గౌడ్ సభ్యులుగా డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పటికే కర్నాటక, మధ్యప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో పర్యటించి, అక్కడి బీసీ కమిషన్లతో చర్చించింది. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు ఆయా రాష్ట్రాల్లో అనుసరించిన విధివిధానాలను అధ్యయనం చేసి, తెలంగాణలో అనుసరించాల్సిన విధివిధానాలపై కసరత్తు ప్రారంభించింది. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను క్రోడీకరిస్తూ నిర్దిష్ట నమూనాను, బీసీల డాటా సేకరణకు కావాల్సిన ప్రశ్నావళిని సిద్ధంచేసే పనిలో నిమగ్నమైంది. ఇదే సమయంలో తెలంగాణలో ప్రభుత్వం మారి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో కులగణన చేపట్టి, బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో బీసీ కమిషన్ డైలామాలో పడిపోయింది. కులగణన ద్వారా రిజర్వేషన్లను స్థిరీకరించాలా? లేక ఓటర్ జాబితా ప్రకారం చేయాలా? అన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయకపోవడమే ఇందుకు కారణం. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జారీచేసిన టీవోఆర్‌కు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టేందుకు కూడా రేవంత్ సర్కారు సహకరించకపోవడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు బీసీ కమిషన్ ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. ఈ కమిషన్ గడువు ఈ నెల 31తో ముగియనుండటంతో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ మధ్యలోనే నిలిచిపోయింది.

కమిషన్‌ను కొనసాగించడమే ఉత్తమం

ప్రస్తుత కమిషన్‌ను కొనసాగిస్తేనే రిజర్వేషన్ల స్థిరీకరణ త్వరగా పూర్తవుతుందని బీసీ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. అన్నివిధాలా లాభదాయకమని స్పష్టం చేస్తున్నాయి. కాదని కొత్త కమిషన్‌ను నియమిస్తే రిజర్వేషన్ల స్థిరీకరణతోపాటు స్థానిక ఎన్నికలు తీవ్ర జాప్యమవుతాయని పేర్కొంటున్నాయి. ఒకవేళ కులగణన నిర్వహించినా కూడా దానికి కమిషన్ ఆమోదం తప్పనిసరి. అప్పుడే రిజర్వేషన్లకు సాధికారత లభిస్తుంది. లేదంటే స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు చెల్లుబాటు కావని, కమిషన్ గడువును పొడగించి పని పూర్తిచేసుకోవడం సముచితంగా ఉంటుందని విశ్లేషకులు చెప్తున్నారు.

కొత్త కమిషన్ ఏర్పాటుకే సర్కారు మొగ్గు

వకుళాభరణం కమిషన్ గడువు ముగియగానే కాంగ్రెస్‌కు చెందినవారితో కొత్తగా బీసీ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. చైర్మన్‌గా విశ్రాంత జడ్జిని నియమించాలని యోచిస్తున్నట్టు లీకులు వస్తున్నాయి. కొత్త కమిషన్‌లో చైర్మన్ పదవి కోసం ఓ బీసీ సంఘానికి చెందిన కీలక నేత ఇప్పటికే కాంగ్రెస్‌లోని బీసీ నేతలు, ఢిల్లీ పెద్దలతో మంతనాలు సాగిస్తున్నట్టు జోరుగా వినిపిస్తున్నది. దీన్నిబట్టే ప్రభుత్వం కొత్త బీసీ కమిషన్‌ను నియమించాలని భావిస్తున్నట్టు స్పష్టమవుతున్నది.

మహిళ నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): మహిళ అన్నిరంగాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని, అప్పుడే అభివృద్ధి చెందిన సమసమాజం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య (ఐఫియా), తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళా సాధికారత ఇంకా పరిపూర్ణం కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళాభివృద్ధి మరింతగా జరగాలంటే మహిళలందరూ విద్యావంతులు కావాలని సూచించారు. రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో మహిళా భాగస్వామ్యం మరింతగా పెరగాలని ఆంకాంక్షించారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించినట్టు చెప్పారు. సదస్సులో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ప్రొఫెసర్ వై ప్రశాంతి, ఐఫియా అధ్యక్షుడు సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నబ్ కుమార్ కర్మకార్, సలహాదారు కే సుబ్బారెడ్డి, టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన్య కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, స్టాన్లీ కళాశాలల చైర్మన్ కే కృష్ణారెడ్డి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్ల మెస్, భవనాల అద్దె, కరెంటు బిల్లులను వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘాల నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. విదేశీ విద్యా స్కాలర్‌షిప్పులను అర్హులందరికీ ఇవ్వాలని కోరారు.

సిరిసిల్లలో మరో నేత కార్మికుడి ఆత్మహత్య

ఉపాధి లేక.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక బలవన్మరణం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన గోవింది సదానందం (38) నేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. 3నెలల క్రితం రూ.3 లక్షల వరకు అప్పు చేసి తుంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. కోలుకున్న తరువాత ఉపాధి లేక మద్యానికి బానిసయ్యా డు. మద్యం తాగి ఇంటికి వచ్చి న సదానందాన్ని భార్య మందలించింది. మరునాడు 24న గడ్డిమందు తాగగా, దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు

కులగణన చేయకుంటే అగ్గి రాజేస్తాం

- పార్లమెంట్‌లో బీపీ మండల్ చిత్రపటాన్ని పెట్టాలి: జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి, ఆగస్టు 25: కులగణన చేయకుంటే దేశవ్యాప్తంగా అగ్గి రాజేస్తామని బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం సామాజిక న్యాయ జేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ ఆధ్వర్యంలో బీపీ మండల్ 106 జయంతి వేడుకలు రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం బీపీ మండల్ విగ్రహాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్ఠించాలని, జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ మనువడు, హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.